సాక్షి తిరుపతి
సోమవారం, 2, సెప్టెంబర్, 2024



తవ్వేస్తూ.. అమ్మేస్తూ..
టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా ఇసుక, మట్టి, గ్రావెల్ దందా సాగిస్తున్నారు. యథేచ్ఛగా తవ్వేసి అమ్మేస్తున్నారు. - 10లో



ఉద్యోగ భద్రత కల్పించండి సార్!
మద్యం దుకాణాల సిబ్బంది ఉద్యోగ భద్రత కోరుతూ ఆదివారం కదంతొక్కారు. ర్యాలీలు నిర్వహించారు. - 10లో



వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు
చంద్రగిరి మండలంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. - 10లో

న్యూస్‌రీల్

రేపు తిరుపతిలో జాబ్‌మేళా

తిరుపతి అర్బన్ : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ఎదురుగా ఎస్‌పీసీ ట్రెనింగ్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. నియోలింక్, డిక్సన్ టెక్నాలజీస్, ఇండోమిం, ముత్తూట్ గ్రూప్, కోల్మాన్ సర్వీసెస్ తదితర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్ ఉత్తీర్ణులైనవారు జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే యువతీ యువకులు ఆధార్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్‌తోపాటు బయోడేటా ఫామ్ తీసుకురావాలని సూచించారు. అలాగే ముందుస్తుగా పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9177508279, 9703437472 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యాసంస్థలకు నేడు సెలవు

తిరుపతి అర్బన్ : వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆదేశాలను బేఖాతర్ చేసి పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువులు, వాగులు, వంకలు వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలని రెవెన్యూశాఖను ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



పద్మావతి జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్ర నుంచి వస్తున్న అభ్యర్థులు

తిరుపతి అర్బన్ : యూపీఎస్సీ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు తిరుపతిలో యూపీఎస్‌సీ నేషనల్ డిఫెన్స్ అకాడమీ- నావల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలు జరిగినట్లు వివరించారు. మొత్తం 495 మంది అభ్యర్థులకు గాను డిఫెన్స్-నావల్ అకాడమీ పేపర్-1 పరీక్షకు 248 మంది, పేపర్-2 పరీక్షకు 255 మంది హాజరైనట్లు చెప్పారు. అలాగే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలకు మొత్తం 326 మంది హాజరుకావాల్సి ఉండగా, తొలి సెషన్‌కు 132 మంది, రెండో సెషన్‌కు 132 మంది, మూడో సెషన్‌కు 75 మంది వచ్చినట్లు వివరించారు.

మరువలేని మహనీయుడు


- ప్రతి గుండెలో కొలువైన మహానేత
- నిరుపేదల కడుపు నింపిన సంక్షేమ ప్రదాత
- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

2009 సెప్టెంబర్ 2వ తేదీ.. యావత్ తెలుగుజాతి దిగ్భ్రాంతికి గురైన రోజు. అన్నదాత గుండె పగిలిన రోజు. అక్క చెల్లెమ్మలు కన్నీరు మున్నీరుగా విలపించిన రోజు.. అవ్వాతాతలు ఆవేదనకు గురైన రోజు. పేదల పెన్నిధి తిరిగిరాని లోకాలకు తరలివెళ్లిన రోజు. రైతు బాంధవుడు లేడని.. అపర భగీరథుడు ఇక రాడని వేలాదిమంది ఊపిరి ఆగిపోయిన రోజు. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన మహనీయుడు దివికేగిన రోజు. కరువు నేలను సస్యశ్యామలం చేసిన నిత్య కృషీవలుడు కన్నుమూసిన రోజు.. ప్రజల ముంగిటకే పాలన అంటూ 'రచ్చబండ' కోసం చిత్తూరుకు వస్తూ నిష్క్రమించిన రోజు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా జిల్లాతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ..

తిరుపతి అర్బన్: సంక్షేమానికి సరికొత్త భాష్యం చెప్పిన నేత వైఎస్సార్. అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించిన ప్రగతి ప్రదాత. చిల్లుపడిన ప్రతి గుండెనూ పూడ్చిన ధన్వంతరి. పేద విద్యార్థులకు పెద్ద చదువుల భాగ్యం కల్పించిన మహనీయుడు. పాలనకు మానవతను అద్దిన మహానేత. నిరుపేద గోడు విని సొంత గూడు కల్పించిన దార్శనికుడు. శ్రీసిటీతో పారిశ్రామిక బాట వేసిన నిర్దేశకుడు. అన్నదాతకు నీరందించి కరువుకాటకాలను తరిమికొట్టిన అపర భగీరథుడు. ఇలా ఎన్నెన్నో.. అందుకే రాజన్న పాలన స్వర్ణయుగమని ప్రజలు ఇప్పటికీ కొనియాడుతుంటారు.

అభివృద్ధి అడుగులు

2004లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాజీవ్ పల్లె బాట కింద జిల్లాలోని సత్యవేడు నియోజకవర్గంలో తొలిసారిగా పర్యటించారు. సత్యవేడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్‌తో పాటు ఉబ్బల మడుగు, భూపతేశ్వరకోన, రాళ్లవాగు నీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేశారు. అలాగే దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక వాడగా పేరొందిన 'శ్రీసిటీ' వైఎస్సార్ రూపకల్పనే. 2006లో అధికారికంగా సెజ్ స్థాపనకు శ్రీకారం చుట్టారు. 8 పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. ఆయన సంకల్ప బలంతో మొదలైన శ్రీసిటీ పారిశ్రామిక వాడ అంచెలంచెలుగా అభివృద్ధి చెంది 200కి పైగా పరిశ్రమలకు కేంద్రంగా మారింది. సుమారు రూ.35వేల కోట్ల పెట్టుబడుతో 30 దేశాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఈ క్రమంలోనే గాలేరు-నగరి, హంద్రీ నీవా సుజల స్రవంతి, సోమశిల-స్వర్ణముఖి ప్రాజెక్టులకు రూ.4వేల కోట్లు కేటాయింపు చేసి పనులు చేపట్టారు. శ్రీకాళహస్తిలో సమీపంలో మన్నవరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2005 జూలైలో తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టారు. వేద విశ్వవిద్యాలయం ఆయన కృషి ఫలితమే. తిరుమలలో కుమారధార- పసుపుధార జంట ప్రాజెక్టులను రూ.100 కోట్లతో పూర్తి చేయించారు. శ్రీపద్మావతి వర్సిటీలో మహిళా ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించిన మహానేత వైఎస్సార్‌ను ఎప్పటికీ.. ఎన్నటికీ తెలుగుజాతి మరువదు.



ప్రతిష్టాత్మక శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నేడు 70వ వసంతంలోకి అడుగుపెడుతోంది. 69ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో లక్షలాది మంది ఉన్నత భవితకు దిశానిర్దేశం చేసింది. విద్యాబుద్ధులు నేర్పించి ఉత్తమంగా రాణించేందుకు బాటలు వేసింది. అత్యుత్తమ కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చి వేలాదిమంది ఉపాధి కల్పనకు మార్గం సుగమం చేసింది. వివిధ రంగాల్లో వందలాది మంది నిపుణులను తీర్చిదిద్ది దేశానికి అందించింది. శ్రీవారి పద సన్నిధిలో ప్రస్తుతం సుమారు 7వేల మంది విద్యార్థులకు సరస్వతీ కటాక్షం ప్రసాదిస్తోంది.



విద్యుద్దీపాలకాంతులీనుతున్న ఎస్వీ యూనివర్సిటీ పరిపాలనా భవనం

ఇప్పటికీ వెంటాడుతున్న సమస్యలు

- వర్సిటీ బ్యూటిఫికేషన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్
- తాగునీటి ఇక్కట్లు తీర్చేందుకు తెలుగుగంగ సరఫరా
- ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ ఏర్పాటు
- పరిశోధనలకు పెద్ద పీట వేయాల్సిన అవసరం ఉంది
- అకడమిక్ కన్సల్టెంట్ల సమస్యల తీర్చేందుకు 110జీఓ అమలు
- అడ్వాన్స్ సైంటిఫిక్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు
- ఆర్టికల్స్, శోధన పత్రాల సమర్పణకు ప్లాగరిజమ్ టెస్ట్, ఫారిన్ ఎగ్జామినేషన్ ఏర్పాటు
- ఇంజనీరింగ్ విద్యార్థులకు అధునాతనమైన ల్యాబ్‌లు
- ఖాళీ పోస్టుల భర్తీ

సప్తపదుల సోపానం.. ఎస్వీయూ ప్రస్థానం

- 70వ వసంతంలోకి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
- 54 విభాగాలు.. 78 కోర్సుల విద్యాధామం
- ఎందరో మహనీయులకు నడత నేర్పిన మహోన్నత స్థానం
- ఉపాధి కల్పనే లక్ష్యంగా అందుబాటులో జాతీయ విద్యావిధానం
- నేడు ఎస్వీ యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

తిరుపతి సిటీ : రాయలసీమకే తలమానికంగా విలసిల్లుతున్న ఎస్వీ యూనివర్సిటీ నేటితో 69 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. తొలుత మద్రాసు యూనివర్సిటీతో అనుబంధంగా పనిచేసిన ఈ విద్యాసంస్థ.. టంగుటూరి ప్రకాశం పంతులు కృషి ఫలితంగా 1954లో ఎస్వీయూనివర్సిటీగా రూపాంతరం చెందింది. టీటీడీ నుంచి సుమారు 904 ఎకరాలను 99ఏళ్లపాటు లీజు ప్రాతిపదికన తీసుకుని వర్సిటీ ఏర్పాటు చేశారు. తొలి ఏడాదిలో ఆరు మేజర్ విభాగాలతో ప్రారంభమైన వర్సిటీ నేడు 52 విభాగాలతో 78 కోర్సులలో 7వేల మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తోంది. ఇప్పటికే నాక్ ఏ గ్రేడ్ పొందింది. త్వరలో ఏప్లస్ గ్రేడ్‌ను సాధించేందుకు ప్రయత్నిస్తోంది. పరీక్షల విభాగాన్ని పూర్తిగా కంప్యూటరీకరణ చేయడం ద్వారా పారదర్శకంగా, త్వరితగతిన ఫలితాలను విడుదల చేస్తోంది.

వేడుకలకు సర్వం సిద్ధం

ఎస్వీ యూనివర్సిటీ 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఆధ్వర్యంలో వర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో ఘనంగా జరుపుకోనున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఉద్యోగుల క్రీడా పోటీలు పూర్తి చేశారు. వర్సిటీ పరిపాలనా భవనాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.


విద్యా దేవాలయం



యూనివర్సిటీల్లో ఎస్వీయూ అంటే ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ ఉంది. సామాన్య విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చిన విద్యా దేవాలయం ఈ వర్సిటీ. ఎంతో మంది ముఖ్యమంత్రులను, మంత్రులను సివిల్ సర్వెంట్లను, గ్రూప్స్ అధికారులను అందించిన విద్యా సంస్థకు వీసీగా సేవలందించడం సంతోషంగా ఉంది. ఎస్వీయూలో విద్యనభ్యసించిన విద్యార్థి నిరుద్యోగిగా మారకూడదనే ఉద్దేశంతో ఉపాధి కల్పన దిశగా బోధనా పద్ధతుల్లో మార్పు చేశాం. జాతీయ విద్యావిధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం.

– సీహెచ్ అప్పారావు, ఇన్‌చార్జి వీసీ, ఎస్వీయూ


వర్సిటీ అభివృద్ధే లక్ష్యం



ఎస్వీయూను దేశంలోనే ప్రథమస్థానంలో నిలపడమే మా లక్ష్యం. వర్సిటీలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నాం. ఉపాధి, ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా వర్సిటీ పనిచేస్తుంది. వర్సిటీ అభివృద్ధే కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నాం. విద్యార్థులు, ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ వర్సిటీ ప్రతిష్టను ఇనుమడింపజేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నాం.

– భూపతినాయుడు, రిజిస్ట్రార్, ఎస్వీయూ

ఉద్యోగుల కృషి ఎనలేనిది



ఎస్వీయూ మరింత అభివృద్ధి చెందేందుకు ఉద్యోగ సంఘాల తరపున పని చేస్తాం. రాయలసీమకే తలమానికమైన వర్సిటీలో ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా పనిచేయడం ఆనందంగా ఉంది. వర్సిటీ అభివృద్ధిలో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల కృషి ఎనలేనిది. సమష్టి కృషి ఫలితంగా ఎస్వీయూకు పేరుప్రతిష్టలు మరింతగా పెరిగాయి. వర్సిటీలో ఘనంగా వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం.

– జి.శ్రీధర్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, ఎస్వీయూ

తట్టా బుట్టలతో నిరసన



నిరసన తెలుపుతున్న వ్యాపారులు, నేతలు

తిరుపతి(అలిపిరి): శ్రీవారి మెట్టు వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో తట్టా బుట్టలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ 12 రోజులుగా నిరసన దీక్ష నిర్వహిస్తున్నా టీటీడీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 20 ఏళ్లుగా శ్రీవారి మెట్లనే నమ్ముకొని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మి, ఉపాధ్యక్షుడు గండికోట నాగ వెంకటేష్ , కార్యదర్శి మునిరాజా, నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, బుజ్జి, ముఖేష్, మురళి, శ్రీవారి మెట్టు వ్యాపారులు యుగంధర్, చిట్టిబాబు, మల్లికార్జున , గిరి ,లోకనాథం, చిరంజీవి, నరసింహా, సోను, మొగులప్ప, రాంబాబు, గణేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 81,207 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,414 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.53 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించమని వెల్లడించింది.

ఇంట్లోనే పవర్

సోలార్ విద్యుత్ ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగా ఇంట్లోనే కరెంట్ తయారు చేసుకునే అవకాశం కల్పించింది. ఇందుకోసం ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్ట్ బిజిలీ యోజన పథకం ప్రవేశపెట్టింది. ఆసక్తిగలవారు సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసుకునేందుకు రాయితీలు.. రుణాలు అందిస్తోంది. ఈ క్రమంలోనే పవర్ జనరేట్ చేసుకున్న గృహ వినియోగదారుడికి ఉచితంగా విద్యుత్ వాడుకునే వెసులుబాటు అందిస్తోంది.

- సోలార్ ప్యానళ్ల ద్వారా విద్యుదుత్పత్తికి అవకాశం
- 'పీఎం సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలీ యోజన' ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- వినియోగదారులకు రాయితీపై రుణసదుపాయం

తిరుపతి రూరల్ : ప్రజలు తమ ఇంటి నుంచే విద్యుత్ ఉత్పత్తి చేసుకుని వినియోగించుకునేందుకు కేంద్రప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకు ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. అయితే దరఖాస్తుదారుడి కరెంట్ వాడకం 300 యూనిట్లలోపు ఉండాలనే నిబంధన విధించింది. అనంతరం వారు డిస్కమ్ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఈ క్రమంలో కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తికి సుమారు రూ.70వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఇందులో ప్రభుత్వం రూ.30వేల వరకు సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేయిస్తుంది. అనుమతులు వచ్చాక వినియోగదారుడి ఇంటి రూఫ్‌పై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటర్ల స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి..వినియోగదారుడు వాడుకున్న విద్యుత్‌ను లెక్కిస్తారు.



ఓ ఇంటిపైన ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

పథకం వివరాలు

వినియోగం (యూనిట్‌లలో)	సోలార్ కెపాసిటీ (కిలోవాట్‌లలో)	పెట్టుబడి	సబ్సిడీ
1-150	1- 2	రూ.70వేలు	రూ.30వేలు- రూ.60వేలు
150-300	2-3	రూ.1.20లక్షలు	రూ.50వేలు - రూ.78 వేలు
300 లోపు	3	రూ.1.70లక్షలు	రూ.78 వేలు

నమోదు ఇలా...

ఈ పథకంలో చేరేందుకు ముందుగా సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆరు నెలల కరెంటు బిల్లుల కాపీలను జతపరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

దరఖాస్తుల వెల్లువ...

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ ముఫ్ట్ బిజిలీ యోజన పథకానికి విద్యుత్ వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దక్షిణ ప్రాంత విద్యుత్ సరఫరా సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలోని తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు సర్కిల్స్ పరిధిలో ఈ నెల ఆగస్టు చివరి నాటికి 7,866 మంది వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు. తిరుపతి-2,314, అనంతపుం-1,709, వైఎస్సార్ కడప-1,512, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు-1,217, కర్నూలు-1,114 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో 7,701 దరఖాస్తులను ఆమోదం తెలిపామని, ఇప్పటికే 1,279 పనులు ప్రారంభించామని తెలిపారు. ఈమేరకు 101 పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా 374 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు వివరించారు.

సబ్సిడీ కోసం ఇలా..

నెట్ మీటర్ అమర్చిన తర్వాత పోర్టల్‌లో వినియోగదారుడు తన బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిలోవాట్ రూఫ్ కెపాసిటీ కోసం 3-4 ప్యానల్స్ (ఒక మీటరు వెడల్పు, 1.5 మీటర్ల ఎత్తు) అమరుస్తారు. కిలోవాట్ సోలార్ రూఫ్ టాప్ ప్యానల్‌తో నెలకు దాదాపు 125కు పైగా యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్స్ సూర్యుడి వేడి పీల్చుకోవడం ద్వారా ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోండి



వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చేసుకునే సూర్యఘర్ చక్కటి పథకం. ఇంధనశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి మార్గదర్శకంలో దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. వినియోగదారులకు దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రుణ సదుపాయం కల్పిస్తుంది. 6-7 ఏళ్లలో పెట్టిన పెట్టుబడి తిరిగి పొందవచ్చు. నెట్ మీటరు విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలు ఉంటే విద్యుత్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకునే అవకాశముంది.

– అయూబ్‌ఖాన్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్), ఎస్పీడీసీఎల్, తిరుపతి

'ఖేలో ఇండియా'కు దీపిక



నాయుడుపేటటౌన్ : తమిళనాడులో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీలకు నాయుడుపేటకు చెందిన బి.దీపిక ఎంపికైనట్లు తైక్వాండో కోచ్ పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 29వ తేదీన తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా పోటీల్లో తైక్వాండో మహిళల విభాగంలో దీపిక ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణతో తీరని నష్టం

● ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు



మాట్లాడుతున్న రాంబాబు

తిరుపతి (అలిపిరి): లాభాల్లో వచ్చే జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరణ చేసి కార్పొరేట్ వ్యక్తులకు అప్పగిస్తే దేశానికి తీరని నష్టమని ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు తెలిపారు. ఆదివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే పలు బ్యాంకులను ప్రైవేటీకరించారని, రాబోయే రోజుల్లో లాభాల్లో ఉన్న బ్యాంకులను ప్రైవేటీకరణ చేయకుండా ప్రజలు, ఉద్యోగులు ఐక్యంగా ఉంటూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు.. విద్యార్థులకు ప్రభుత్వ బ్యాంకులు రుణాలు అందిస్తూ దేశానికి వెన్నెముకగా ఉండి కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. ఏపీ పీబీఈఎఫ్ కార్యదర్శి కె.రమాప్రసాద్ మాట్లాడుతూ బడా వ్యాపారులు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని దేశం విడిచి పారిపోయారని.. వారి ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సైదాపురం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్న ఘటన తూర్పుపూండ్ల గ్రామ సమీపంలో ఉన్న కై వల్యానది వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ క్రాంతి కుమార్ కథనం.. ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లు కైవల్యానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు.



చిల్లకూరు మండలం కలవకొండ సమీపంలో టిప్పర్లలో తరలిపోతున్న ఇసుక



చిల్లకూరు మండలం పొన్నపోలు వద్ద ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తవ్వకాలు

పొన్నపోలులోనే..





చిత్తూరు మండలంలో..



కలవకొండ సమీపంలో ప్రభుత్వ భూమిని యంత్రాలతో మట్టి తవ్విస్తున్న టీడీపీ నేతలు

● తవ్వేస్తూ.. అమ్మేస్తూ..

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో టీడీపీ నేతలు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. నదులు.. వాగులు.. వంకల్లో ఇసుకను కొల్లగొట్టేస్తున్నారు. చెరువుల నుంచి ప్రభుత్వ.. ప్రైవేట్ స్థలాల వరకు ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వేస్తున్నారు. కనిపించిన చోటల్లా గ్రావెల్‌ను తోడేస్తున్నారు. నిత్యం వందలాది టిప్పర్లు.. ట్రాక్టర్లతో అక్రమంగా రవాణా చేసేస్తున్నారు. అధికారులను మామూళ్ల మత్తులో ముంచి రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు.

– సాక్షి ప్రతినిధి, తిరుపతి



కాళీపాకంలో ఇసుక తరలింపునకు దారి ఏర్పాటు చేసుకుంటున్న అక్రమార్కులు



తిరుపతి రూరల్ మండలం పాడిపేట వద్ద ఇసుక దోపిడీ



యంత్రాలతో మట్టిని తవ్వేయడంతో గుంతలుగా మారిన ప్రభుత్వ భూమి



శ్రీకాళహస్తి సమీపంలో స్వర్ణముఖిలో ఇసుకను కొల్లగొడుతున్న దృశ్యం

రాజీ లేకుండా రహదారుల నిర్మాణం



జ్ఞాపిక అందుకుంటున్న విజయ్‌కుమార్‌రెడ్డి

భాకరాపేట : జాతీయ రహదారుల నిర్మాణంలో రాజీ లేకుండా భద్రత, నాణ్యతా ప్రమాణాలను మెయిల్ కంపెనీ పాటిస్తుందని నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ గోపీకృష్ణ ప్రశంసించారు. ఆదివారం భాకరాపేటలోని మెయిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీలేరు–కాలూరు ప్రాజెక్టులో మిలియన్ సేఫ్‌మ్యాన్ హవర్స్ సాధించడం విశేషమన్నారు. అధిక భద్రతా ప్రమాణాలను పాటించడంలో మెయిల్ బృందం అంకితభావాన్ని గుర్తించామని చెప్పారు. అనంతరం ఎంఈఐఎల్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ హెడ్ రవి, పి.రెడ్డి, మురళీకృష్ణ, మస్తాన్‌షరీఫ్, లతీఫ్, లైజనింగ్ ఆఫీసర్ విజయ్‌కుమార్‌రెడ్డికి జ్ఞాపికలు బహూకరించారు.

లారీ డ్రైవర్‌కు కత్తిపోట్లు



రుయాలో చికిత్స పొందుతున్న రమేష్

తిరుపతి రూరల్ : తనపల్లె క్రాస్ వద్ద శనివారం రాత్రి టీ తాగేందుకు వచ్చిన లారీ డ్రైవర్‌పై మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడికి పాల్పడ్డారు. వివరాలు.. వెదురు కుప్పం మండలం చిన్నంగారిపల్లెకు చెందిన బైరాగి రమేష్ కరకంబాడి రోడ్డులోని అమెరికన్ బార్ వద్ద లారీలో బొగ్గు లోడ్ తీసుకుని బయలుదేరాడు. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి సమీపంలోని బ్యాటరీ తయారీ ఫ్యాక్టరీ వద్ద అన్‌లోడ్ చేశాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో తిరిగి వస్తూ తనపల్లి క్రాస్‌లోని ఓ దాబా వద్దకు వచ్చి టీ తాగేందుకు ఆగాడు. ఇంతలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో రమేష్‌తో వాగ్వాదానికి దిగారు. ఆగ్రహం పట్టలేక కత్తితో పొడిచారు. స్థానికులు వెంటనే స్పందించి బాధితుడిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మూర్తి తెలిపారు.

గంజాయి మత్తులో వీరంగం



బీహారీని పట్టుకున్న స్థానికులు

గూడూరురూరల్ : స్థానికంగా ఓ పరిశ్రమలో పని చేసేందుకు వచ్చిన బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి ఆదివారం గంజాయి సేవించి ఆ మత్తులో వీరంగం సృష్టించాడు. చేతిలో కత్తి పట్టుకుని స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాడు. పట్టుకునేందుకు యత్నించగా, సమీపంలోని ఇళ్లలోకి దూరి రాళ్లతో దాడికి పాల్పడ్డాడు. ఎట్టకేలకు అతడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని బీహార్‌వాసిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



భాకరాపేట కనుమలో అదుపుతప్పి బోల్తా పడిన లారీ

చంద్రగిరి : మండలంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. ఇంటీరియల్ సామాన్లతో కర్ణాటక నుంచి తిరుపతి వైపు వస్తున్న మినీ లారీ మామండూరు సమీపంలో అదుపుతప్పి కాలువలోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో క్లీనర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భాకరాపేట కనుమలో...

భాకరాపేట కనుమలో మదనపల్లె నుంచి తిరుపతికి కొయ్యల లోడుతో వస్తున్న లారీ ముందు వెళుతున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ క్రమంలో వెనుక వస్తున్న ద్విచక్ర వాహనం లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్ నరసింహులుతోపాటు ద్విచక్ర వాహనాదారుడు గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. రోడ్డుకు అడ్డుగా పడిన లారీను జేసీబీ సాయంతో పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి సార్!

వెంకటగిరి(సైదాపురం): ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్‌లు డిమాండ్ చేశారు. బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లె పనిచేస్తున్న వైన్‌షాపుల సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యం షాపులను ప్రైవేటీకరణ చేస్తామని ప్రకటించారని, అయితే తమ ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వలేదన్నారు.

కోట: కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని మద్యంషాపుల సిబ్బంది ఆదివారం కోట క్రాస్ రోడ్డు వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం వైఖరిని ఖండించారు. వేలాది కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని మండిపడ్డారు.



కోట క్రాస్‌రోడ్డులో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సూళ్లూరుపేట : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ తరహాలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సూళ్లూరుపేట ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలోని వర్కర్స్ ఆందోళనకు దిగారు. హోలీ క్రాస్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ఉద్యోగం ఎప్పటికైనా రెగ్యులర్ చేస్తారని ఆశించామని, ఇప్పుడు నట్టేట్లో ముంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇదే వృత్తిని, లేదంటే ప్రత్యామ్నాయంగా మరో ఉపాధిని చూపించాలని డిమాండ్ చేశారు.

నాయుడుపేటటౌన్ : డివిజన్ పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సూపర్ వైజర్‌లు సేల్స్‌మన్‌లు, ఆదివారం ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి వినతి పత్రం అందించారు. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 15 వేలకు పైగా కుటుంబాలు వీధినపడతాయని వాపోయారు.



వెంకటగిరిలో..



సూళ్లూరుపేటలో..



నాయుడుపేటలో..

ఆయనే వెళ్లిపోయాడు..!

తిరుపతి తుడా: స్విమ్స్ శ్రీపద్మావతి ఆస్పత్రి ఎమ్‌ఐసీయూలో చికిత్స పొందుతున్న సీతారామప్ప అనే రోగి వార్డు నుంచి ఇతరుల ప్రమేయం లేకుండా స్వయంగానే వెళ్లిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు స్విమ్స్ అధికారులు ఆదివారం సీసీ పుటేజీలను పరిశీలించారు. ఆస్పత్రి నుంచి రోగి నడుచుకుంటూ వెళ్లిన ఫొటోలను విడుదల చేశారు. వెస్ట్ సీ ఐ రామకృష్ణ బృందం ఈ మేరకు సీసీ పుటేజీలను తనిఖీ చేశారు. 28వ తేదీ వేకువజామున పద్మావతి ఆస్పత్రి నుంచి లిఫ్ట్ ద్వారా దిగిన రోగి సీతారామప్ప అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లిపోయాడని తేల్చారు. రోగి కోసం విస్తృతంగా గాలిస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ మీడియాకు తెలిపారు.

చర్యల ఉపసంహరణ

ఎంఐసీయూ నుంచి రోగి సీతారామప్ప అదృశ్యమైన ఘటనలో నర్సు, సెక్యూరిటీ సిబ్బంది ముగ్గురిపై స్విమ్స్ డైరెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఇందులో సిబ్బంది తప్పిదం లేదని వెల్లడికావడంతో సిబ్బందిపై తీసుకున్న చర్యలను ఉపసంహరించుకుని, వారిని విధుల్లోకి తీసుకున్నారు.

3 నెలలుగా ప'రేషన్'

తిరుపతి అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ఈ నెల మాత్రం చక్కెర ఇచ్చి చేతులుదులుపునేందుకు యత్నిస్తున్నాఽ. ఇతర సరుకులు అందించకుండా అదిగో ఇదిగో అంటూ మాయమాటలు చెబుతున్నారు. మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటిన క్రమంలో కార్డుదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్నారు. దీనిపై డీలర్లును నిలదీసినా ప్రయోజనం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సైతం తమకు సంబంధం లేదని చేతులెత్తేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటికే సరుకులు వచ్చేవని, బియ్యంతోపాటు చక్కెర, కందిపప్పు, రాగులు, రాగిపిండి, గోధుమపిండి, ఉప్పు తదితర 11 రకాలు పంపిణీ చేసేవారని గుర్తుచేసుకుంటున్నారు.

సర్పంచ్‌పై టీడీపీ నేత దాడి

భాకరాపేట : భాకరాపేటసర్పంచ్ సాకిరి భూపాల్‌పై టీడీపీ నేత యశ్వంత్ ఆదివారం దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్థానికంగా జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నించినందుకే యశ్వంత్ దాడి చేసినట్లు ఆరోపించారు. టీడీపీ నేత, ఓ పత్రిక విలేకరి చిట్టిచెర్ల గ్రామంలో 2070/6 సర్వే నంబరులోని 2 ఎకరాలు, 683/2ఎ లోని 2.5 ఎకరాలకు అక్రమంగా పట్టా పొందారన్నారు. ఈ విషయాన్ని బయట పెట్టడంతో కక్షగట్టి దాడి చేసినట్లు వివరించారు. దీనిపై పోలీసులను వివరణ కొరగా టీడీపీ నేత యశ్వంత్, సర్పంచ్ భూపాల్ ఇరువురిపైనా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పచ్చమూక దాడులపై ఫిర్యాదు

తిరుపతి(అలిపిరి): తమ కుటుంబంపై కత్తులతో దాడులు చేస్తున్నారని.. సోమల మండలం, కమ్మపల్లికి చెందిన కలిచర్ల జయంతి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథి గృహంలో ఆమెను కలిసి తన ఆవేదన వివరించారు. తాము వైఎస్సార్‌సీపీకి మద్దతుదారులమని, రాజకీయ కక్షతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తమ ఇటుకల బట్టీలను ధ్వంసం చేయడం, ఇష్టారాజ్యంగా ఇతరులకు అమ్మేయడం చేస్తున్నారని వెల్లడించారు. తమ 1.5 ఎకరాల్లోని టమాటా పంటను అమ్ముకోనీయకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. ఆగస్టు 5వ తేదీన టీడీపీకి చెందిన రమేష్‌నాయుడు, చిట్టిబాబు, త్రిలోక్‌నాయుడు, మధుసూదన్‌నాయుడు తదితరులు పుంగనూరులోని తన వస్త్ర దుకాణంలోకి చొరబడి ధ్వంసం చేశారని కన్నీరుమున్నీరయ్యారు. పైగా ఎస్పీ సూచన మేరకు పోలీసులు తమపైనే కేసు నమోదు చేశారని తెలిపారు. దీనిపై స్పందించిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంటనే చిత్తూరు ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితురాలిపైనే కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. విచారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు సమస్యలు వివరిస్తున్న బాధితురాలు

ఆలయం పనులు అడ్డుకుంటే సహించం

తిరుపతి రూరల్ : మండలంలోని సీ.మల్లవరం కాలూరులో పునర్నిర్మిస్తున్న పురాతన శ్రీరామ భజన మందిరం పనులు అడ్డుకుంటే సహించే ప్రసక్తే లేదని స్థానిక భక్తుల ప్రతినిధి చాముండేశ్వరి స్పష్టం చేశారు. ఆదివారం ఆలయం వద్ద భక్తులతో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. దేవదాయశాఖ నిబంధనల మేరకు కాంట్రిబ్యూషన్ డిపాజిట్ చేశామని, కమిషనర్ సూచన మేరకు రూ.27లక్షల వ్యయంతో ఆలయం నిర్మిస్తుంటే టీడీపీ నేతలు అడ్డుకోవడం సరికాదన్నారు. దీనిపై ప్రశ్నించిన గర్భిణిపై దాడి చేసి గాయపరిచారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే గ్రామస్తులపై కూడా దాడులకు యత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన ఆలయ నిర్మాణంలో వివాదం ఎందుకని భావిస్తే, చివరకు తనపైన కూడా దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు ఒంటిపై దుస్తులను సైతం చించివేసి, జుట్టు పట్టుకుని లాగి అవమానించారని వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్, దేవదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆలయ నిర్మాణ పనులను పూర్తి చేయించాలని కోరారు.



సమస్య వివరిస్తున్న భక్తులు